

గాలి పీల్చారో..!





దుమ్ము, ధూళితో పొంచి వున్న ముప్పు

ఏలూరు నగరం దుమ్ము, ధూళి కణాలతో నిండిపోయింది. సాధారణ స్థాయిని దాటి ప్రమాదకర పరిస్థితుల్లో కొన్నేళ్ళుగా కొనసాగుతోంది. ఫలితంగా వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. ముఖ్యంగా రోడ్ల వెంబడి వెలువడే ధూళి కణాలు వాయు కాలుష్యాన్ని మరింత పెంచగా, వాహనాల నుంచి వెలువడే పొగ ఎయిర్ పొల్యూషన్‌ను మరికొన్ని రెట్లు పెరగడానికి కారణమవుతున్నట్టు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పరిశీలనలో తేలింది. దేశవ్యాప్తంగా అత్యధిక వాయు కాలుష్యం ఉన్న 118 పెద్ద, మధ్య తరహా నగరాలు, పట్టణాల జాబితాలో ఏలూరు కార్పొరేషన్‌ను ఒకటిగా పీసీబీ చేర్చడం గమనార్హం.

వాయు కాలుష్య నగరాల జాబితాలో ఏలూరు నగరం

ఛిద్రమైన రహదారులు, కాలం చెల్లిన వాహనాల పొగతో కాలుష్యం

గాలి నాణ్యతపై పీసీబీ విశ్లేషణ

ఏలూరు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో భారీ పరిశ్రమలు, గనులు లేకపోయినా వాయుకాలుష్యం తీవ్రత అధికంగా ఉందని పీసీబీ కొన్నేళ్ళ క్రితమే గుర్తించింది. నేష నల్ ఎయిర్ మానటరింగ్ ప్రోగ్రాం(నాంప్) కింద రాష్ట్రంలో ఎంపిక చేసిన నగరాలు, పట్టణాల్లో గాలి నాణ్యతను పరిశీలించడానికి ఆయా ప్రాంతా ల్లో యంత్రాలను అమర్చారు. వీటి నుంచి సేకరిం చిన విశ్లేషణల్లో ఏలూరు పరిధి అంతటా గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలో ఉందని నిర్ధా రించారు. ఒక మీటర్ క్యూబ్‌లో ధూళికణాలు 60 మైక్రోగ్రాములకంటే ఎక్కువ పరిణామంలో ఉంటే ఆ ప్రాంతంలో వాయు కాలుష్యం ఉన్నట్టుగా ప్రకటిస్తారు. ఏడాది కాలంలో ఈ విశ్లేషణలన్నిం టినీ క్రోడీకరించి వాయుకాలుష్యం ఉన్నదీ, లేనిదీ నిర్ణయిస్తారు. ఆ ప్రకారం ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒక దశలో గాలి నాణ్యత గరిష్ట మోతాదు అంటే 69 మైక్రో గ్రాములకు చేరిందని పీసీబీ ప్రకటించి వాయు కాలుష్య నగరాలు, పట్టణాల జాబితాలో చేర్చింది. కొంత కాలం క్రితం నగరంలోని జూట్‌మిల్లు మూసివేసిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోవున్న గాలి నాణ్యతను కొలిచే యంత్రాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం వాయుకాలుష్యం కొం త మేర అంటే 64 మైక్రో గ్రాములకు తగ్గిందని ఇటీవల నిర్ధారణకు వచ్చారు. అయినప్పటికీ పలు రహదారులు ఛిద్రమై వాహనాలు వెళుతు న్నపుడు ధూళికణాలు భారీ మొత్తంలో పైకి లేచి వాయు కాలుష్యం మోతాదులను పెంచుతున్నా యని తేల్చారు. రోడ్ల దుస్థితి నగరంలో ఆశ్రం హాస్పిటల్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు, కైకలూరు రోడ్డు, మరి కొన్ని అంతర్గత రహదారు ల్లో ధూళికణాలు విపరీతంగా ఎగిసి పడుతున్న ట్టు గుర్తించారు. మరోవైపు కాలం చెల్లిన వాణిజ్య వాహనాలు, ప్రైవేటు వాహనాల నుంచి వెలువడే పొగ కూడా వాయుకాలుష్య మోతాదులను కొన్ని రెట్లు పెంచడానికి కారణమవుతోంది.

త్వరలో గాలి నాణ్యత మిషన్

ప్రజలు గాలినాణ్యతను ప్రత్యక్షంగా తెలుసుకునేలా కంటిన్యూస్ యాంబియటీ ఎయిర్ క్వాలిటీ స్టేషన్‌ను ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి పీసీబీ చర్యలు చేపట్టింది. ఈ మిషన్ ద్వారా ధూళికణాలను విశ్లేషించి ప్రతి పది నిమిషాలకోసారి గాలి నాణ్యతను బహిరం గంగా ఏర్పాటుచేసే స్ర్కీన్‌పై అందరూ వీక్షించ డానికి వీలుగా ప్రదర్శించే ఏర్పాటు ఇందులో ఉంటుంది.

నియంత్రణపై దృష్టి



ఏలూరు నగరాన్ని వాయు కాలుష్యరహితంగా తీర్చిద్దడానికి చర్యలు అవసరం. రోడ్లపై గుంతలను పూడ్చే పనులు పూర్తయితే ధూళి కణాల మోతాదు తగ్గుతుం ది. రోడ్లను నీళ్ళతో తడుపుతుండాలి. మొక్కలను విరివిగా నాటాలి. వాహనాల నుంచి మోతాదుకు మించి పొగ వెలువడకుండా పర్యవేక్షించాలి. మృతదేహాల దహనానికి గ్యాస్ ఆధారిత శ్మశాన వాటిక వినియోగించాలి. నిర్దేశిత ప్రమాణాలకు మించి వాయు కాలుష్యం ఏలూరులో ఎక్కువగా ఉన్నప్పటికీ తగిన చర్యలతో ప్రజారోగ్యానికి ముప్పేదీలేదు.

- కె.వెంకటేశ్వరరావు, ఇంజనీరు, పీసీబీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి

మార్పు చూపిస్తా



'ఆంధ్రజ్యోతి'తో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మహిళలు, చిన్నారుల సంరక్షణ మా తొలి ప్రాధాన్యత. అభయ పేరిట ప్రతి విషయాన్ని వాచ్ చేస్తున్నాం. అన్ని వర్గాల్లో అవగాహన పెంచుతున్నాం. కొత్త పోలీస్‌స్టేషన్ల నిర్మాణంతోపాటు ఉన్న వాటిలో సౌకర్యాల కల్పన దిశగా ఏర్పాట్లు చేస్తున్నాం. సైబర్ నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటాం. సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టింగ్‌లు పెట్టి ఎవరినైనా కించపరిచినా చూస్తూ ఊరుకోం. చట్టపరంగా పోలీస్ ఏం చేయాలో అదే చేస్తుంది. జిల్లాలో స్మార్ట్ పోలీస్ సిస్టం తెస్తున్నాం. దీని కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమల్లోకి తేబోతు న్నాం. అంటున్న జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్. జిల్లాలో నిర్దిష్ట చర్యలు ఏ రకంగా తీసుకుంటున్నామో ఆయన మాటల్లోనే...

మహిళా రక్షణకు ప్రాధాన్యం.. రంగంలో అభయ టీమ్‌లు

జిల్లాలో అభయ కింద చిన్నారులు, మహిళల సంరక్షణకు చర్యలు తీసుకున్నాం. దీనికనుగుణంగా ఎక్కడికక్కడ అన్ని వర్గాలను చైతన్యం పరుస్తున్నాం. పోలీస్‌పరంగా ప్రత్యేక టీంలు రంగంలో ఉన్నాయి. వీరందరికీ వాహనాలు సమకూర్చడతో పాటు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నిఘా పెడతారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, విద్యాసంస్థలు, పట్టణ, నగర ప్రాంతాల్లో కీలక ప్రదేశాలు, పార్కులతో సహా అన్ని ప్రాంతాల్లోను అభయ టీంలు రోజూ సంచరిస్తాయి. అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెడతారు. అనుచితంగా ప్రవర్తించే వారెవరినీ విడిచిపెట్టేదిలేదు. పిల్లల సంరక్షణ ఎంత ముఖ్యమో, మహిళల సంరక్షణ అంతే ముఖ్యం. దీని నిమిత్తం వాట్సప్ నెంబర్ 95503 51100ను అందుబాటులో ఉంచాం. దీని ద్వారా తెలిసిన సమాచారం అందచేస్తే తక్షణ చర్యలు తీసుకోవడానికి వీలుంటుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎవరైతే దొంగతనాలకు పాల్పడుతున్నారో వారి గత నేర చరిత్రను కూడా ప్రత్యేకంగా సేకరిస్తున్నాం. దొంగతనం జరగడానికి దారితీసిన పరిస్థితులపై కూడా అధ్యయనం చేస్తున్నాం. ఎటువంటి పరిస్థితు ల్లోనూ ఎవరైనా ఇల్లు విడిచి దూర ప్రాంతానికి వెళ్ళదలిస్తే ఆ సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియచేయాలి. ప్రత్యేకించి నేర నిరోధానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రివేళల్లో నిఘా పెంచాం. ప్రజల అప్రమత్తత నేర నిరోధానికి ఎంతో అవసరం.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

పేకాట, కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలన్నింటిపైనా నిఘా పెట్టాం. పోలీసుల కళ్ళుగప్పి తాము ఏదైనా చేయగలుగుతామని ఎవరైనా అనుకుంటే పొరపాటే. చట్టానికి లోబడే ఉండాలి తప్ప అతి క్రమించి వ్యవహరిస్తే కఠినంగానే వ్యవహరిస్తాం. పట్టణ, నగర ప్రాంతాల్లోనే కాకుండా పల్లె ప్రాంతాల్లో కూడా వీటికి అవకాశం లేనే లేదు.

టెక్నాలజీతో సైబర్ నేరాల అదుపు

అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఎవరినైనా మోసం చేద్దా మని భావించే సైబర్ నేరగాళ్ళ పనిపడతాం. అందుబాటులో ఉన్న టెక్నాలజీ మేరకు సైబర్ నేరాల అదుపుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజలు అపరిచిత వ్యక్తులను నమ్మి మీ వద్ద ఉన్న సమాచారాన్ని వారితో పంచుకోవద్దు. ఎలాంటి అవసరం వచ్చినా తక్షణం పోలీసులను సంప్రదించండి.

సోషల్ మీడియా అదుపులో ఉండాలి

సోషల్ మీడియాలో ఇష్టానుసారం ఎదుటవారిని కించపరిచేలా, దూషిం చేలా అనుచిత వ్యాఖ్యలను పోస్టింగ్ చేసే వారిపై ఇప్పటికే ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దీని ప్రకారమే పోలీసులు సైతం మరింత వేగంగా చర్యలకు దిగుతున్నారు. సోషల్ మీడియాలో ఉన్న వ్యక్తులు తమంతట తాముగా అదుపులో ఉండాలే తప్ప ఇష్టానుసారం వ్యవహరించినా, చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలో మార్పులు

ఏలూరు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ఒక కార్యాచరణ చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న సిగ్నల్ వ్యవస్థలో మార్పులు చేస్తున్నాం. ప్రత్యేకించి ఇంటెలిజెంట్ సిగ్నలింగ్ వ్యవస్థను త్వరలో తెస్తాం. దీనిద్వారా కూడళ్ళల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సులభతరం అవుతుంది. జిల్లాలో మిగతా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్టేషన్లు పెట్టేందుకు కొన్ని ప్రతిపాదనలు ఉన్నాయి.

37 బ్లాక్ స్పాట్‌లు గుర్తించాం

ఏలూరు జిల్లా పరిధిలోని జాతీయ రహదారిలో 37 చోట్ల బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాం. ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదాలే ఎక్కువ. దీనికితోడు హైవేలో ఎక్కడికక్కడ లైట్‌లు ఏర్పాటు చేసేలా సంబంధీకులను సంప్రదిస్తున్నాం.

త్వరలో స్మార్ట్ పోలీసింగ్ సిస్టం

త్వరలోనే స్మార్ట్ పోలీసింగ్ సిస్టం అమలులోకి రాబోతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) ద్వారా అధికారులు, సిబ్బంది కేసు నమోదు, పూర్వాపరాలన్నీ ఎఐ ద్వారానే సందేహం నివృత్తికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. దీని ద్వారా పోలీస్ సమాచారాన్ని ఎవరైనా ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు.

పోలీసు సంక్షేమంపై దృష్టి

పోలీసులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేరువ చేస్తున్నాం. మహిళా పోలీసులకు అనువుగా ఇప్పటికే ప్రత్యేక డార్మెటరీ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నాం. జీలుగుమిల్లి, పోలవరం, బుట్టాయి గూడెంలలో కొత్తగా పోలీస్‌స్టేషన్ల నిర్మాణం. అలాగే పోలీస్ క్యాంటీన్ ద్వారా అవసరమైన వస్తువు పొందేందుకు తాజాగా ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చాం. పోలీస్ స్కూలులోను ఈ మధ్యన మరింత సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులకు వెసులుబాటు ఇచ్చాం.

స్టాంపులకు ఆధార్

- సర్కార్ నూతన విధానం
- తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- అక్రమాల నియంత్రణే లక్ష్యం
- నకిలీలకు అడ్డుకట్ట
- కృతిమ కొరతకు చెక్



ఏలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దస్తావేజులు, రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జ్యుడిషియల్ స్టాంప్ అమ్మకాల తీరును సంస్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. నాసిక్ నుంచి పెద్దసంఖ్యలో స్టాంప్‌లను తెప్పించి అన్ని జిల్లాలకు సరఫరా చేసింది. నాన్‌జ్యుడిషియల్ స్టాంప్‌లు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదుచేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే స్టాంప్‌లు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంప్ వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. అయితే కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంప్‌లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేవారన్న విమర్శలు ఉన్నాయి. స్టాంప్ కాగితాల పై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. కూటమి ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఆధార్ తప్పనిసరి

ఒకటి, అంతకన్నా ఎక్కువగా నాన్‌జ్యుడిషియల్ స్టాంప్‌లు కొనుగోలు చేసినా కొత్త విధానంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాల్సిందే. స్టాంపులు పొందటానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆధార్ నెంబర్‌ను కంప్యూటర్‌లో నమోదు చేయాలి. వివరాలు తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒకవ్యక్తి ఐదు నుంచి పది స్టాంపుల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్‌నంబర్ నమోదు చేయటం వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు నమోదు చేశారో తెలుస్తుంది.

లెక్క తెలిసిపోతుంది ఇలా..

స్టాంపుల విక్రయాల్లో గతంలో మాదిరిగా రికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. రిజిస్టర్లు, అకౌంట్ పుస్తకాలు కలిగి ఉండే స్టాంపు వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల కౌంటర్లో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయి అనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా జరిగే కార్యాలయాల నుంచి ఎక్కువ వినియోగం ఉండే కార్యాలయానికి స్టాంపులను తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ క్రమంలో స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది.

ఆస్తి కోసమే చంపేశాడు

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు 7

వర్గీకరణపై పోరాడాలి

అంబేడ్కర్ మునిమనుమడు రాజారత్నం



సెలవుల సమరం!



- టీచర్లు, విద్యాశాఖమధ్య పది శాతం పరిమితి చిచ్చు
- సీఎల్స్ వినియోగంపై ప్రభుత్వ ఆంక్షలులేని వైనం
- బోధనకు విఘాతం ఉండకూడదనే విద్యాధికారుల నిర్ణయం

ఏలూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన సెలవులను వాడుకునే విషయంలో జిల్లా విద్యాశాఖ, టీచర్ల మధ్య కొన్నిరోజులుగా అంతర్యుద్ధమే కొనసాగుతోంది. కొద్ది రోజుల క్రితం జిల్లానుంచి పదోన్నతి,బదిలీపై వెళ్ళిపోయిన పూర్వపు డీఈవో అబ్రహం జారీచేసిన మౌఖిక ఆదేశాలమేరకు పాఠశాలలో పనిచేస్తున్న మొత్తం టీచర్లలో 10శాతం మందికి మించి సెలవులను (ఏ రోజుకారోజు) వినియోగించరాదని హెచ్‌ఎంలకు సూచించడంతో సమస్య వచ్చిపడింది. ఈ నెలలో కార్తీకమాసం పూజలు/నోములు, డిసెంబరు నెలలో క్రిస్మస్ పండుగ ప్రత్యేక ఆరాధనలు వంటివి ఉండటంతో పలువురు టీచర్లు సెలవుల కోసం ప్రయత్నిస్తుండగా, మరికొందరు అత్యవసర అనారోగ్య కారణాలతోను, మరికొందరు వివాహాలు తదితర కార్యక్రమాలకు హాజరయ్యేందుకు సెలవులను వినియోగించుకోవడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇటీవల హైస్కూళ్ళ టీచర్ల సెలవులను నియంత్రించేందుకు జిల్లావిద్యాశాఖ హెచ్‌ఎంలకు జారీచేసిన మౌఖిక ఆదేశాలు తాజాగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ కేడర్ టీచర్లకు కూడా వర్తింపజేస్తూ సెలవుల మంజూరు అధికారాన్ని ఎంఈవోలకు ఇవ్వడంతో సమస్య జటిలమైంది.

టీచర్లేమంటున్నారంటే..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్, ఎంటీఎస్(కనీస వేతనస్కేలు) టీచర్లు మొత్తం 8257 మంది పనిచేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రకటించిన సెలవుల ప్రకారం ఏడాదికి 15 క్యాజువల్ లీవులు (సీఎల్స్), 7 స్పెషల్ సీఎల్స్, మహిళా ఉపాధ్యాయులకైతే మరో 5 సీఎల్స్ ఉంటాయి. ఇవిగాక స్కూలులోని టీచర్లందరికీ వర్తించేలా ఏడాదికి 5 ఆప్షనల్ హాలీడేస్(ఓహెచ్)లు ఇస్తారు. ఇతర శాఖల ఉద్యోగులకైతే స్పెషల్ సీఎల్స్ మినహా మిగతా సాధారణ సెలవులు వర్తిస్తాయి. సాధారణంగా ఏటా జనవరి నుంచి ఏప్రిల్ వరకు టీచర్లు సీఎల్స్‌ను వినియోగించుకోరు. సంక్రాంతి పండుగ సెలవులు, వార్షిక పరీక్షల సీజన్‌కావడం, ఆ వెంటనే 45రోజులపాటు వేసవి సెలవులు ఎలాగూ ఉంటాయి కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో తప్ప సాధారణ సెలవులను వినియోగించుకోవడానికి ఇష్టపడరు. ఏడాదికి నిర్దేశించిన మొత్తం సెలవులను ఆ ఏడాదే వినియోగించుకోవాలి. ఒకవేళ వాడుకోకపోతే మరుసటేడాదికి వాడుకునే వెసులుబాటు ఉండదు ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన సెల వులనే వాడుకుంటున్నపుడు విద్యాశాఖ ఆంక్షలు ఏమిటన్నది టీచర్ల ప్రశ్నగా ఉంది.

విద్యాశాఖ వాదన ఇదీ..

బడిలో ఒకేసారి టీచర్లు రోజుల తరబడి ఎక్కువ మంది సెలవులు పెడితే బోధనకు విఘాతం కలుగకూడదనే మొత్తం ఉపాధ్యాయుల్లో రోజుకు 10శాతం మందికిమించి సెలవులు ఇవ్వవద్దని సూచించినట్టు జిల్లా విద్యాశాఖవర్గాలు తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నాయి. పండుగలు, ఇతర ప్రభుత్వ సెలవులు లేని నెలలు కేవలం నవంబరు, డిసెంబరు మాత్రమేనని...ఇందులోనూ టీచర్లు ఒకేసారి సెలవులు పెడితే పాఠ్యాంశాల బోధన ఎలా జరుగుతుందని విద్యాధికారుల అభిప్రాయం. ప్రభుత్వ ఉద్యోగ, ఉపా ధ్యాయులు, ఇతర సిబ్బందికి నిబంధనల ప్రకారం ప్రకటించిన సీఎల్స్‌ను ఎలా వాడుకోవాలో స్పష్టత లేదని విద్యాశాఖవర్గాలే వివరణ ఇస్తున్నాయి. దీనిపై ముద్రించిన ఏపీ లీవ్స్ రూల్స్ మాన్యువల్‌లోనూ సీ ఎల్స్ వినియోగంపై ఆంక్షలులేవని వివరిస్తున్నాయి.

కొసమెరుపు

సీఎల్స్‌ను వాడుకునేవిషయంలో విద్యాశాఖ పెట్టిన ఆంక్షలు, సెలవులను వినియోగించుకునేందుకు ఉపాధ్యాయుల వాదనలు ఎలావున్నా, ఈ నెల మొదటి వారం నుంచి ఇప్పటి వరకు (23వతేదీ) స్కూలు పనిదినాల్లో సీఎల్స్‌ను వివిధ కారణాలతో పెట్టిన టీచర్ల సంఖ్య సరాసరి 8నుంచి 15శాతంలోపే ఉండటం గమనార్హం. ఇందులో ఈ నెల 16న కార్తీక పౌర్ణమి నోముల కారణంగా గరిష్టంగా 20శాతం నమోదైందని భావిస్తున్నారు. ఇది మినహా మిగతా రోజుల్లో మొత్తం టీచర్లలో ఎక్కడా 15 శాతం దాటి సీఎల్స్ వినియోగించుకున్న సందర్భాలు లేవు.

టీచర్ల హక్కులను కాలరాయడమే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

సెలవులను పది శాతానికి పరిమి తంచేయడం టీచర్ల హక్కులను కాలరాయడమేనని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బి.గోపిమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఈవో, ఎంఈవో, హెచ్‌ఎంలకు కలెక్టర్ మౌఖిక ఆదేశాలు జారీ చేయ డాన్ని ఖండిస్తున్నామన్నారు. పాఠశాల నిర్వహణకు విఘాతం కలుగకుండా టీచర్లకు సెలవులు ఇచ్చేందుకువున్న పాత నిబంధనలనుకాదని, సెలవులను కుదించడం హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు.



పెదూరు చేపల చెరువులో తేలిన వ్యర్థాలు

వ్యర్థ చేపలు!

- కోళ్ల వ్యర్థాలు తిని పెరుగుతున్న చేపలు
- ఆరోగ్యానికి హానికరం
- నిషేధించినా ఆగని వ్యర్థాల వినియోగం
- రవాణా అరికట్టలేని అధికారులు

ముదినేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకానికి కోళ్ళ, ఇతర పక్షి జాతుల వ్యర్థాలను వినియోగించటం రోజు రోజుకీ పెరుగుతున్నది. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాల రవాణాను అరికట్టలేని పరిస్థితి ఏర్పడింది. వ్యర్థాల వినియోగం వల్ల చేపల మేత వ్యయం ఆదా అవుతుంది. అయితే వ్యర్థాల వినియోగం వల్ల పెరిగిన చేపలు తింటే ప్రజలు అనారోగ్యాల బారిన పడే పరిస్థితి నెలకొన్నది. ఎక్కువగా కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలువురు చేపల చెరువుల రైతులు కోళ్ల వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా వినియోగిస్తున్నారు. సుమారు 20 సంవత్సరాలుగా చేపల రైతుల సంఘాలు కూడ కోళ్ల వ్యర్థాల వినియోగం అరికట్టాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వంలో, స్థానిక అధికార యంత్రాంగంలో కదలిక లేదు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కోళ్ల వ్యర్థాల రవాణాను అరికట్టాలని శాసనసభలో కూడా డిమాండ్ చేశారు. అయినా మత్స్య, రెవెన్యూ, పోలీసు అధికారులలో స్పందన లేదు.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

కోళ్ల వ్యర్థాలు ఎక్కువగా తెలంగాణ, బెంగళూరు నుంచి కోస్తా జిల్లాలకు రాత్రి వేళల్లో దిగుమతి అవుతున్నది. ఏపీలోని పలు జిల్లాల నుంచి కూడా కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు కోళ్ల వ్యర్థాల రవాణా జరుగుతున్నది. చెక్ పోస్టులు ఉన్నా ఫలితం లేదు. నకిలీ పర్మిట్లతో రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఖర్చులో 30 శాతం ఆదా


ఫంగస్ చేపల పెంపకానికి కోళ్ళ వ్యర్థాలను వినియోగిస్తే చేపల మేతకు అయ్యే వ్యయంలో 30 శాతం ఆదా అవుతుంది. దీంతో ఫంగస్ చేపలు పెంచే రైతులు ఎక్కువ శాతం మంది కోళ్ల వ్యర్థాలను మేతగా వినియోగించేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఆంధ్రా చేపలకు చెడ్డ పేరు

కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపల్లో నాణ్యత లోపించి, రుచి తక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాల మార్కెట్‌లో ఆంధ్రా చేపలకు డిమాండ్ తగ్గుతున్నదని ముదినేపల్లి, కైకలూరు ప్రాంత రైతులు చెబుతున్నారు. స్థానికంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఫంగస్ చేపలను రవాణా చేసిన వ్యాపారులు అక్కడ ఒక్కోసారి డిమాండ్ లేక నష్టపోతున్నారు.

కోళ్ల వ్యర్థాలను అరికట్టాలి

నంబూరి వెంకట్రామరాజు, అధ్యక్షులు, రాష్ట్ర చేపల రైతుల సంఘం



ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న కోళ్ల వ్యర్థాల రవాణాను అధికారులు అరికట్ట లేకపోవటం శోచనీయం. అధికారులు పట్టించుకోవటం లేదు. వెంటనే కోళ్ల వ్యర్థాల రవాణాను అరికట్టాలి.



వైభవంగా మావుళ్ళమ్మ అమ్మవారి పడిపూజ

భీమవరం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ మాలధారులచే ఆదివారం రాత్రి ఆలయం వద్ద ఉన్న అమ్మవారి పడి పూజ వైభవంగా చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అమ్మవారి గరగలు, ఉత్స మూర్తిని ఉంచారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అమ్మవారికి సహస్రనామాలతో కుంకుమార్చన చేసి అఖండ హారతి అందించారు. అమ్మవారి శరణుఘోషతో పరిసరప్రాంతాలు మారుమోగాయి. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.

జేఎన్వీలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తు గడువు పెంపు

పెదవేగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి సంబంధించి దరఖాస్తులు సమర్పించడానికి గడువు తేదీని పొడిగించినట్టు జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి నవోదయ విద్యాలయ సమితి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. ప్రవేశపరీక్షకు దరఖాస్తుకు ఈనెల 26వ తేదీవరకు నవోదయ విద్యాలయ సమితి గడువు పొడిగించిందని ఆమె చెప్పారు. అలాగే దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి ఈనెల 27, 28 తేదీలవరకు అవకాశం కల్పించారన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అభ్యర్థులు 9వ తరగతిలో ప్రవేశానికి https://cbseitms.nic.in/2024/nvsix, 11వ తరగతిలో ప్రవేశానికి https:// cbse itms.nic.in /2024 /nvsxi వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వివరించారు.

ఇక.. చాలు

అనాదికాలం నుంచి ఆమె అణగదొక్క బడుతోంది.. ఇంటా బయట ఆమె వేధింపులకు గురవుతూనే ఉంది.. అమ్మగా, భార్యగా, కుమార్తెగా, బంధువుగా ఆమె ఎన్నో సేవలు అందిస్తూనే ఉంది.. సమాజంలో పూర్వకాలం నుంచి ఆమెపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధింపులు కొనసాగు తున్నాయి. ఆమెను చిన్న చూపు చూస్తూనే ఉన్నారు. ఆమెకు రక్షణగా ఎన్ని చట్టాలు ఉన్నా దాడులు మాత్రం ఆగడం లేదు.. కష్టాలను భరిస్తూ కన్నీళ్లను దాచేసుకుంటూ ఇంకా సర్దుకుపోతూనే ఉంది.. ఇక ఈ హింస ఆగాలంటే ఆమె చైతన్యం చెందాలి.. పోరాడాలి..నేడు మహిళలపై హింస నిర్మూలన దినం సందర్భంగా ప్రత్యేక కథనం





మహిళలపై పెరుగుతున్న దాడులు
చట్టాలున్నా ఆగని హింస
మహిళలు చైతన్యం పొందాలి
చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
నేడు మహిళలపై హింస నిర్మూలన దినం

భీమవరం క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :ఆడపిల్ల అర్ధరాత్రి నడి రోడ్డుపై ఒంటరిగా నడిచినప్పుడే నిజమైన స్వతంత్ర్యం అని ఆనాడు మహాత్మా గాంధీ చెప్పిన మాటలు ఇప్పటికీ నేరవేరడం లేదు. నిత్యం ఏదోక చోట మహిలలపై దాడులు, అఘాయిత్యాలు, అరాచకాలు జరుగుతూనే ఉన్నాయి. ఆడవారు పగలు కూడా రోడ్లుపై తిరగాలంటేనే భయపడే పరస్థితి నెలకొంది. అలానే ఇంటి వద్ద ఉన్న కూడా బంధువులు, తెలిసిన వాళ్ళ రూపంలో ఏదొక దారుణం జరుగుతున్నాయి. అసలు మహిళలకు స్వేచ్ఛ అనేది దొరుకుతుందా.. వారిపై అఘాయిత్యాలుకు అడ్డుకట్ట పడుతుందా అనేది ప్రశ్నార్థకంగానే ఎన్నో ఏళ్ళుగా మిగిలిపోయింది.

దాడులకు అడ్డుకట్ట వేసేదెలా..?

ఇటీవల కాలంలో ఏదొక చోట ఏదొక ప్రాంతంలో మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. కామంతో కళ్ళు మూసుకుపోయి కొందరు అయితే ప్రేమ పేరుతో మరికొందరు వంచిస్తున్నారు. నెలల చిన్నారుల వద్ద నుంచి 60 ఏళ్ళ వృద్ధ మహిళల వరకు కామంతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా దాడులు మాత్రం తగ్గడం లేదు. మహిళలపై ప్రేమ అనే సాకు చూపించి వారు ఒప్పుకోకపోతే వారిపై అనేక రకాలుగా దాడులకు పాల్పడుతున్నారు. యాసిడ్ దాడులు, కత్తితో దాడులు ఇలా అనేక రకాలుగా హింసకు పాల్పడుతున్నారు. వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపినా కూడా బెయిల్‌పై బయటకు వచ్చి అలాంటి దాడులు మళ్ళీ మళ్ళీ చెయ్యడం గమనార్హం. మహిళలు, బాలికలు, విద్యార్థులుపై దాడులు అరికట్టాలంటే ఇంకా కఠినమైన శిక్షలు రావాలని మహిళా సంఘాల నాయకులు కోరుతున్నారు. మహిళలు స్వేచ్ఛగా రోడ్డుపై తిరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అంటున్నారు. దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన కేసులు నమోదు చేసి ఉరి శిక్షలు, యావజ్జీవ కారాగార శిక్షలు పడేలా చేస్తే ఇటువంటి అఘాయిత్యాలు, దాడులను అరికట్టవచ్చని చెబుతున్నారు. ఇటీవల కాలంలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు ఇవీ..

- భీమవరం మండలంలో ఒక వృద్ధురాలిపై ఒక యువకుడు ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించి అఘాయిత్యానికి పాల్పడ్డానికి ప్రయత్నించగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- భీమవరం ఒకటవ పట్టణంలో కొంత కాలం క్రితం సొంత బాబాయి (పినతండ్రి) బాలికపై ఎవ్వరూ లేని సమయంలో అఘా యిత్యానికి పాల్పడగా ఆ బాలిక తల్లితండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- భీమవరం ఒకటవ పట్టణంలో ఒక బాలికను బాబాయి (పిన తండ్రి) వసబర్చుకుని గర్భవతిని చేసి తీరా విషయం తెలిశాక ఆ బాలికను హత్య చేసి పంట పొలాల్లో పడివేశాడు. కనిపించడం లేదని తల్లితండ్రులు ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.
- జిల్లాలోని ఒక పట్టణంలో 8 నెలలు చిన్నారిపై వరకు తాత అయిన వృద్ధుడు ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడటంతో ఆ బాలిక తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా ఆ వృద్ధుడిని అరెస్టు చేశారు. ఇలాంటి సంఘటనలు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏడాదికి 300 నుంచి 400 వరకు జరుగుతూ ఉన్నాయి.



ఏడాదికి 200 కేసులు

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పూర్వకాలం నుంచి మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఎంతో మంది సంఘ సంస్కర్తలు కృషి చేసి ఎన్నో చట్టాలు తీసుకువచ్చే విధంగా పోరాటాలు చేశారు. ఆడబిడ్డ కడుపులో ఉన్న నాటి నుంచి వృద్ధురాలి వరకూ ఎన్నో రక్షణ చట్టాలు ఉన్నాయి. కానీ వాటిని తెలుసుకోలేక వాటిని ఎలా వినియోగించుకోవాలో తెలియక మహిళలు వేధింపులకు గురవుతున్నారు. కొంత మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. భర్త అత్తింటివారు పెట్టే హింసలకు ఎంతో మంది బలి అయిపోతూనే ఉన్నారు. ఏలూరు జిల్లాలో పరిశీలిస్తే ఏడాదికి 200 వరకట్న వేధింపు కేసులు నమోదు అవుతున్నాయి. మహిళలపై ఇతరులు వేధింపు కేసులు మరో 25 నమోదవు తున్నాయి. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏడాదికి వంద కేసులు నమోదు అవు తున్నాయి. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కూడా మహిళలపై హింస కేసులు కౌన్సెలింగ్‌తో రాజీ చేస్తున్నారు. చట్టం తెలిసిన వారు సైతం మహిళలపై దాడులకు పాల్ప డుతూనే ఉన్నారు. సాటి మహిళలే అత్త రూపంలో కోడళ్ళను హింసిస్తూ ఉన్నారు. ఇలాంటి కేసులు జిల్లాలో నమోదు అవుతూనే ఉన్నాయి.

90 శాతం కౌన్సెలింగ్‌తోనే చక్కబెడుతున్నాం



ఇటీవలి కాలంలో ఓర్పు, సహనం, అందరిలో తగ్గిపోతున్నాయి. యాంత్రిక జీవితం, మానసిక ఒత్తిడులతో క్షణికావేశంలోనే కోపతాపాలకు గరవుతున్నారు. పచ్చని కాపురంలో చిన్న చిన్న మనస్పర్ధలతోనే పట్టుదలకు పోయి కాపురాలు కూల్చుకుంటున్నారు ఇలా వచ్చిన ఫిర్యాదులు 90 శాతం కౌన్సెలింగ్ ద్వారానే తిరిగి కాపురాలు నిలబెట్టుకుంటున్నారు. మహిళలను హింస పెట్టిన వారికి ఖచ్చితంగా శిక్షపడే విధంగా ప్రత్యేక మానిటరింగ్ సెల్ విధానంలో పనిచేస్తూ సాక్ష్యులను సకాలంలో కోర్టుకు హాజరు పరుస్తున్నాం. ఇప్పటికి ఈ ఏడాది 13 కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడ్డాయి. మహిళలు హింసకు గురైతే 112 కాని 95503 51100 నంబర్‌కు వాట్సప్ మెస్సేజ్ పెడితే పది నిముషాల్లోనే అభయ మహిళా రక్షక దళం వస్తుంది. ధైర్యంగా ఫిర్యాదు చేయండి.

- ఎం.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్, ఏలూరు

ప్రత్యేక చట్టాలు రావాలి



ఇటీవల కాలంలో మహిళలు, బాలికలు, విద్యార్థులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి కఠినమైన శిక్షలు అమలయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అప్పుడే దాడులు, హింసలను కొంత వరకు అరికట్టవచ్చు. ప్రభుత్వాలు దాడులను అరికట్టేందుకు ఎన్నో రకాల చట్టాలు తీసుకువచ్చినా కొందరు మృగాల్లో ఎటువంటి మార్పులు రావడం లేదు.

-కళ్యాణి, ఐద్వా జిల్లా మాజీ కార్యదర్శి

తల్లితండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



పిల్లలు భవిష్యత్ కోసం తల్లితండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు.అలాగే వారి జీవితాలు ఎంతో ఆనందంగా ఉండాలని మంచి ఉద్యోగాలు సంపాదించి ఎంతో ఎత్తుకు ఎదగాలని చూస్తారు. కాని కొందరు మాత్రం అడ్డుదార్లు తొక్కుతున్నారు. చదువుకునే వయసులోనే ప్రేమ అనే వ్యామోహంతో అవతలివారి ఇష్టాలు లేకుండానే వారి వెంటపడి చివరకు వారు తిరస్కరించే సరికి దాడులకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దీనిపై తల్లితండ్రులు చిన్నప్పటి నుంచి వారిపై దృష్టి పెట్టాలి.

- రంగారావు , ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

శిక్షలు కఠినంగా ఉండాలి



మహిళలపై దాడులు, హింసలు నిరోధించేందుకు ప్రత్యేక చట్టాలు ప్రభుత్వాలు తీసుకువచ్చినా కొందరు ఇలాంటి దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. ఇంకా కఠినమైన శిక్షలు పడే విధంగా చట్టాలు రావాలి. చిన్నారులు, బాలికలు, మహిళలపై పేట్రేగిపోవడానికి కారణం...వారిలోని రాక్షసత్వం. ఆ రాక్షసత్వాన్ని అణిచివేసినప్పుడే దాడులను అరికట్టవచ్చు.

- వై.న్యూటన్, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

లేసు అల్లికలో మరో మైలు రాయి



లేసు అల్లుతున్న మహిళలు

పరిశ్రమకు అంతర్జాతీయ గుర్తింపు
నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా లేసు పరిశ్రమ ఈ ఏడాది మరో మైలు రాయిని తాకింది. నరసాపురం మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన జెజె లక్ష్మీ అండ్ కంపెనీ ఈ ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌కు లేసు వస్తువుల్ని ఎగుమతి చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. తాజాగా జిల్లాలో తయారు చేస్తున్న లేసు ఉత్పత్తులకు అంతర్జాతీయంగా భౌగోళిక (జియోగ్రాఫికల్) గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా హస్తకళలకు సంబంధించి ఎనిమిది పరిశ్రమలను కేంద్ర జౌళిశాఖ ఎంపిక చేస్తే వాటిలో నరసాపురం లేసు ఉత్పత్తులు కూడా ఉండటం గమనార్హం. దీన్ని పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలో జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాపుకు జిల్లా కలెక్టర్ నాగరాణి హాజరై అవార్డును అందుకోనున్నారు. ఇదే సమయంలో లేసు ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

జిల్లాలో లేసు పరిశ్రమకు డచ్ వారి కాలంలోనే నాంది పడింది. వ్యాపార నిమిత్తం దేశానికి వచ్చిన డచ్ వారు ఇక్కడ మహిళలకు లేసు అల్లికలపై శిక్షణ ఇచ్చారు. అలా తయారు చేసిన వస్తువుల్ని వారు అక్కడ దేశాలకు ఎగుమతి చేసి అమ్మేవారు. స్వాతంత్రం తరువాత ఈ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందింది. మొదట్లో ఢిల్లీ, ముంబయి వంటి నగరాలకే పరిమితమైంది. అయితే కొందరు విద్యావంతులైన వ్యాపారులు విదేశీ మార్కెట్లపై కూడా దృష్టి పెట్టి అమెరికా, యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చారు. ఇలా చిన్నగా ప్రారంభమైన ఈ పరిశ్రమ ఒకనొక దశలో రూ.350 కోట్ల మార్కెట్‌కు చేరింది. అత్యధికంగా లేసు ఎగుమతి సంస్థలన్నీ నరసాపురం మండలం సీతారాంపురంలోనే ఉన్నాయి.ఈ గ్రామానికి చెందిన చాలామంది వ్యాపారులు లేసు ఎగుమతుల్లో రాష్ట్రపతి, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డులు కూడా అందుకున్నారు. తరువాత పాలకొల్లు, ఆచంట ప్రాంతాల్లో కూడా కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా సీతారాంపురం లేసు ఎగు మతుల్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ గ్రామంలో 2000లో లేసు పార్కు ఏర్పాటు చేసింది. ఇక్కడ మహిళలకు శిక్షణ, మార్కెటింగ్, డిజైన్లపై శిక్షణ ఇస్తారు. ఈ లేసుపార్కు పరిధిలో జిల్లాలోని ఆరు మండలాలు, కోనసీమ జిల్లాలో మూడు మండలాలు విస్తరించాయి. మొత్తం ఈ పార్కు పరిధిలో 50 వేల మంది సభ్యులు ఉన్నారు.

మళ్లీ పరిశ్రమకు పూర్వవైభవం

లేసు ఉత్పత్తుల్లో చైనా దూసుకుపోతుంది. అత్యధికంగా మిషనరీ మేడ్ అల్లికల్ని తయారు చేయడంతో తక్కువ మొత్తానికే విదేశీ మార్కెట్‌ల్లో అమ్మకాలు జరుపుతుంది. ఈ కారణంగా గడిచిన పదేళ్ల నుంచి లేసు పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఎగుమతులు కూడా తగ్గాయి. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. ఇలాంటి తరుణంలో లేసు పరిశ్రమకు అంతర్జాతీయంగా భౌగోళికంగా గుర్తింపు రావడంతో లేసు పరిశ్రమకు ఊపిరి పోసినట్లైయింది. కేంద్రం మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించి ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, ఆర్డర్లు అందిస్తే మళ్లీ ఈ పరిశ్రమకు పూర్వవైభవం వస్తుందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

చాలా సంతోషంగా ఉంది



లేసు పరిశ్రమకు అంతర్జాతీయంగా జియోగ్రాఫికల్ గుర్తింపు రావడం చాల సంతోషం. దేశ వ్యాప్తంగా హస్తకళలకు సంబంధించి ఎనిమిది పరిశ్రమలను ఎంపిక చేస్తే వాటిలో నరసాపురం లేసు పరిశ్రమ కూడా ఉండటంతో మళ్లీ ఈ రంగానికి పూర్వ వైభవం వచ్చినట్లైయింది. ప్రభుత్వాలు ప్రోత్సాహకం అందిస్తే మళ్లీ పరిశ్రమకు మంచి రోజులు వస్తాయి. వేలాది మంది ప్రత్యేకంగా పరోక్షంగా ఉపాధి పొందుతారు.

-కలవకొలను తాతాజీ, లేసు ఎక్స్‌పోర్టర్



బాస్కెట్ బాల్ పశ్చిమ జట్టు ఎంపిక

పెనుమంట్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు వైబీఏ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే కప్ వచ్చే నెల 6,7,8,9 తేదీల్లో బాస్కెట్బాల్ పోటీలకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు వైబీఏ అధ్యక్షుడు చర్ల బాలాజీ రెడ్డి తెలిపారు. కెప్టెన్‌గా కుమార్ వర్మ, బాస్కెట్బాల్ ప్లేయర్స్‌గా ముని సందీప్, ఏ సాయిరాం, ఎస్.కె అమిద్ అలీషా, కేబీఎస్ అన్నవరం రెడ్డి, ఎస్‌టికే రెడ్డి, ఎం.శివ, కే.మణికంఠ, సత్య కిరణ్, ఆశిష్ రాజ్, కే.కుమార్, రవితేజరెడ్డి కే.లోకేష్, విజయ శంకర్, కెమణి కంఠ గోపాల్‌రెడ్డి, కెడానీ జోసఫ్, సూర్యకిరణ్ ఎంపికయ్యారు.

చిన వెంకన్న దర్శనం కోసం వచ్చి అనంతలోకాలకు ..



ద్వారకాతిరుమల, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల చిన వెంకన్న దర్శనార్థం వచ్చిన ఓ అయ్యప్ప మాల ధారుడు స్వామిని దర్శించకుండానే గుండె పోటుకు గురై మృతి చెందాడు. అమలాపురం మండలం ఇందుపల్లికి చెందిన సురేష్ అయ్యప్ప మాలను ధరించి తన మిత్రులతో కలసి పుణ్య క్షేత్రాలను దర్శించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8.50 గంటలకు ద్వారకాతిరుమలకు చేరుకున్న వారు 9 గంటలకల్లా ఆలయం మూసి వేస్తారని తెలుసుకుని జంట గోపురాల వద్ద వాహనం ఉంచి అక్కడ నుంచి ఆలయానికి పరు గులు తీశారు. అయితే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలాడు. స్నేహితులు అతనికి ఫస్ట్ ఎయిడ్ చేసి త్వరగా పీహెచ్‌సికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్య సిబ్బంది చెప్పారు.

విద్యార్థినిపై చేయి చేసుకున్న కరస్పాండెంట్

కేసు నమోదు చేసిన పోలీసులు

ఆకివీడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిపై స్కూల్ కరస్పాండెంట్ చేయి చేసుకోవడంతో బాలిక ఆకివీడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు..మండలంలోని నందమిల్లిపాడుకు చెందిన దారబోయిన అమృత తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అమ్మమ్మ, తాతయ్యల దగ్గర ఉంటూ స్థానిక విజ్ఞాన ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. రోజూ స్కూల్ బస్సులో వచ్చి వెళుతుంది. ఈనెల 22న స్కూల్ వదిలిన తరువాత బస్సులో ఇంటికి వెళుతుండగా కరస్పాండెంట్‌పై విద్యార్థులు సెటైర్లు వేసుకున్నారు. ఈ విషయాన్ని డ్రైవర్ కరస్పాండెంట్‌కు చెప్పడంతో కరస్పాండెంట్ సత్యనారాయణ మూర్తి ఆగ్రహానికి గురై తరగతి గదికి వెళ్ళి విద్యార్థుల అందరి ముందు అమృత చెంపలు వాయించాడు. తన గదిలోకి తీసుకెళ్లి పీక నులిమి చంపేస్తానని బెదిరించారు. జరిగిన విషయం అమ్మమ్మకు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆదివారం ఎంఈవో రవీంద్ర విచారణకు స్కూల్‌కు వెళ్ళగా కరస్పాండెంట్ లేరు. అక్కడ నుంచి స్టేషన్‌కు వెళ్లారు. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు అమృత, కుటుంబ సభ్యులను పిలిపించి విచారించారు. బాలిక తాతయ్యతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యార్థి ఇచ్చిన ఫిర్యాద మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. సోమవారం డ్రైవర్, విద్యార్థులను విచారించి నివేదిక డీఈవోకు అందజేస్తానని ఎంఈవో చెప్పారు.

క్రైమ్ కార్నర్

కుక్క అడ్డురావడంతో... బైక్‌పై నుంచి పడి రెవెన్యూ ఉద్యోగి మృతి

దెందులూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కుక్క అడ్డురావడంతో మోటార్ సైకిల్‌పై నుంచి పడి రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ నడిపల్లి శ్రీనివాస్ (60) మృతి చెందారు. ఆదివారం రాత్రి ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డులో మోటార్ సైకిల్‌పై ఆశ్రం వైపు నుంచి సోమవరప్పాడు అండర్ పాస్ సమీపంలో వెళ్తుండగా రోడ్డు మీద కుక్క అడ్డుగా రావడంతో మోటార్ సైకిల్ అదుపు తప్పి బైక్ పడిపోయింది. ఈ ప్రమాదంలో దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసున్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు

రైలు నుంచి జారిపడి యువకుని మృతి

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు బిహార్‌కు చెందిన యువకుడు జారి కిందపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన అజయ్‌రామ్ (29) రైలులో ప్రయాణిస్తూ ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. ఈ సమాచారం ఎస్‌ఐ సైమన్‌కు అందడంతో ఆదివారం సాయంత్రం వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వృద్ధురాలు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం ఎంఆర్‌సీ కాలనీకి చెందిన బోనెల పాపాయమ్మ (74) ఈనెల 16వ తేదీ ఉదయం జెఎంజె స్కూలు వద్ద రోడ్డుపై నడిచి వెళ్తుండగా ఒక మోటారు సైకిలిస్టు ఢీ కొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య



ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని ఆశ్రం మెడికల్ కాలుజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నర్సరావు పేటకు చెందిన వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఆసుపత్రి అత్యవసర విభాగంలో డ్యూటీ చేయడానికి వచ్చారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు గడియ పెట్టుకుని ఎంత సేపటికి రాలేదు. ఉదయం 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సీఈవో డాక్టర్ హనుమంతరావు ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగులగొట్టి చూశారు. డాక్టర్ జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు, సిరంజ్‌లు లభించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

జవహర్ తండ్రి డాక్టర్ విజయ్ సాగర్ నర్సరావుపేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవహర్ తన తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదు వుతూ మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. ఏలూరు రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో పోస్టు మార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆస్తికోసమే చంపేశాడు

పిన్ని, తమ్ముడిని హత్యచేసిన హంతకుడు అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 40 సెంట్ల వ్యవసాయ భూమి, నాలుగు సెంట్ల ఇంటి స్థలం.. వీటి మార్కెట్ విలువ సుమారు 25 లక్షలు ఉండవచ్చు.. ఈ ఆస్తి కోసం పిన్ని, తమ్ముడిని దారుణంగా హతమార్చాడు..ఆ కిరాతకుడు.. జంట హత్యలు జరిగిన 24 గంటల్లోనే పోలీసులు హంతకుడిని అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదివారం విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన రొయ్యూరు సుబ్బారావుకు భార్య నాంచారమ్మ ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి. సుబ్బారావు నాంచారమ్మ సోదరి అయిన భ్రమరాంబను రెండో భార్యగా పెళ్ళి చేసుకున్నాడు. భ్రమరాంభకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి కూడా వివాహాలు అయ్యాయి. సుబ్బారావు మతి స్థిమితం లేక ఎటో వెళ్ళిపోయాడు. నాంచారమ్మ కూడా లేదు. సుబ్బారావు తండ్రి నాగలింగం పేరుమీద ఉన్న 40 సెంట్ల పొలం, 192 గజాల ఇంటి స్థలం విషయంపై తరచుగా నాంచారమ్మ కుమారుడైన నగేష్‌బాబు (50)కి అతని పిన్ని అయిన భ్రమరాంభ, తమ్ముడైన సురేష్‌కు గొడవలు జరుగుతున్నాయి. పెద్దల ద్వారా పరిష్కారం చేసుకునే ప్రయత్నించగా ఉన్న ఆస్తిని ఇద్దరు చెరో సగం పంచుకోవాలని సూచించారు. దీనికి నగేష్‌బాబు అంగీకరించలేదు. కొన్నేళ్ళ క్రితమే నగేష్‌బాబు ఊరువిడిచి విజయవాడ వెళ్ళి ఒక లారీ కొనుగోలు చేసుకుని మోటారు ఫీల్డ్‌లో ఆర్థికంగా స్థిరపడ్డాడు. అతని కుమారుడు, కుమార్తెకు కూడా వివాహాలు జరిపాడు. అయితే తాత తనకే చెందుతుందని ఒక్క అంగుళం కూడా ఇవ్వనని పెద్దల ముందు చెప్పాడు. ఈనెల 21వ తేదీన సురేష్ భార్య గాయిత్రి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన తండ్రి సంవత్సరీక కార్యక్రమానికి వెళ్ళింది. సురేష్ కూడా ఈనెల 22వ తేదీన ఆ కార్యక్రమానికి తిరిగి ఇంటి వచ్చాడు. ముందు హత్య చేయాలని ప్లాన్ చేసుకున్న నగేష్‌బాబు 22వ తేదీ రాత్రి వచ్చి సాయిబాబా గుడి వద్ద ఉన్నాడు. అర్ధరాత్రి వేళ భ్రమరాంభ ఇంటికి వెళ్ళి తలుపులు కొట్టాడు. వారు బయటకు రాగానే హత్య చేయాలని మాటు వేసుకుని అక్కడే ఉన్నాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చిన భ్రమరాంబపై దాడి చేసి కత్తితో మెడపై నరికేశాడు. ఆమె అక్కడే మరణించింది. ఇంట్లోకి వెళ్ళి గాఢ నిద్రలో ఉన్న సురేష్‌ను కూడా చాకుతో పొడిచి హతమార్చాడు. అక్కడ నుంచి వెళ్ళి సాయిబాబ గుడి సమీపంలో కత్తి, చాకును ఒక ప్లాస్టిక్ పైపులో దాచి వెళ్ళిపోయాడు. ఈ నెల 23వ తేదీ ఈ సంఘటన వెలుగులోకి రావడంతో జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్, మండవల్లి ఎస్‌ఐ రామచంద్రరావు, కానిస్టేబుళ్ళు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం దాచిన కత్తులను తీసుకు వెళ్ళడానికి వచ్చిన నగేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహ రించిన సీఐ రవికుమార్, ఎస్‌ఐ రామచంద్రరావు, కాని స్టేబుళ్ళు నాగాంజనేయులు, నాగార్జునలకు ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను డీఎస్పీ అందించారు.



వివరాలు చెప్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్



హత్యలకు ఉపయోగించిన కత్తి, చాకు

పెరిగిన కూరగాయల ధరలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూరగాయ ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబజారు, బహిరంగ మార్కెట్‌లో ధరలకు పొంతనలేదు. రైతుబజారులో కిలో వంకాయలు రూ.44, బెండ రూ.30, మిర్చి రూ.30, కాకర రూ.30, బీర రూ.40, క్యాబేజి రూ.40, క్యారెట్ రూ.80, దొండ రూ.34, బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.60, గోరుచిక్కుడు రూ.36, చిక్కుడు రూ.68, దోస రూ.30, చామదుంప రూ.48, బీట్‌రూట్ రూ.60, కీర దోస రూ.32, బీన్స్ రూ.70, అల్లం రూ.80, క్యాప్సికం రూ.70, ఆకాకర రూ.120, ఆనప, పొట్ల ఒక్కింటికి రూ.25, కొత్తిమీర కట్ట రూ.20, గోంగూర కట్ట రూ.8, తోటకూర రూ.10, పాలకూర రూ.12, చుక్కకూర రూ.15, మెంతికూర రూ.10, పుదీన రూ.5 చొప్పున అమ్మకాలు జరిగాయి.


పట్టాభిసీతారామయ్య విగ్రహం వద్ద నివాళి

భోగరాజు సేవలు చిరస్మరణీయం

భీమడోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధుడు, గుండుగొలను గ్రామస్తుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. భోగరాజు జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ఆయన విగ్రహానికి భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టాభి సీతారామయ్య చేసిన సేవలను కొనియాడారు. సంఘ సభ్యులు కారే బాబు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో జీరో ఎఫ్ఐఆర్

భీమడోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి గ్రామానికి చెందిన ఏసూరి శివరాంప్రసాద్ (32) సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. 2019 ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రం దమ్మపేటలో విధి నిర్వహణలో ఉన్నాడు. ఏప్రిల్ 7న మోటారు సైకిల్‌పై విధులకు వెళుతుండగా మందపల్లి క్రాస్ రోడ్డు వద్ద లారీ ఢీకొనడంతో తలకి బలమైన గాయమైంది. కోమాలో ఉండడంతో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతూ ఈ నెల 23న మృతి చెందాడు. దీనిపై అతడి భార్య కృష్ణకుమారి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

ఏలూరు టూటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26 నుంచి ఏఎస్ఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ జేడీ రామ్‌కుమార్ తెలిపారు. శారీరక వైకల్యం కలిగిన వారికి మూడు చక్రాల రిక్షారేస్, జావలెన్‌త్రో, షార్ట్‌పుట్, పోటీలు, దృష్టిలోపం కలిగిన వారికి పరుగు పందెం, షార్ట్‌పుట్, క్రికెట్ పోటీలు, బధిరులకు పరుగుపందెం, షార్ట్‌పుట్, క్యారమ్స్ పోటీలు, మానసిక వైకల్యం కలిగిన వారికి పరుగు పందెం, సాఫ్ట్‌బాల్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహిస్తామన్నారు. 26న ఉదయం పెద్దరైల్వే స్టేషన్ వద్ద అల్లూరి సీతారామరాజు క్రీడా మైదానానికి రావాలని కోరారు.

నేడు సమస్యల పరిష్కార వేదిక

కుక్కునూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఆర్డీవో ఎంవీ రమణ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు. మండలంలోని భూసమస్యలు, పునరావాస పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. మండల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

మంచి నడవడికతో ఉండాలి

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ముస్లింలు మంచి నడవడిక, సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం సూచించారు. దేవినేనివారిగూడెంలో ఆదివారం ఇస్మాయిల్, మీరా ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. షేక్ ఇసాయిల్, మున్సిర్, నాగిన్ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్ల లక్ష్మీపురంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.3,650 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

నిడమర్రు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్వగ్రామం పత్తేపురంలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. సర్పంచ్ నీలవేణి, ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, ఇంజనీరింగ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన నిరుద్యోగ సమస్య

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకుల తీరుతో దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని ఏఐవైఎఫ్ నేతలు అన్నారు. స్ఫూర్తిభవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్ర మహాసభల బ్రోచర్లు రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు ఆవిష్కరించారు. ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. విద్య వ్యాపారంగా మారిందని, వైద్యం అందరికీ అందడం లేదన్నారు.


జంగారెడ్డిగూడెంలో రూ.70 లక్షలతో నిర్మించనున్న సుబ్బంపేట రహదారి


ఏలూరు, లింగపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణం


భీమడోలు జంక్షన్‌లో ద్వారకాతిరుమల రహదారికి మరమ్మతులు

రహదారుల అభివృద్ధి

● గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ● జిల్లాలో భారీ గోతుల రోడ్లకు మరమ్మతు

ఏలూరు రూరల్ / జంగారెడ్డిగూడెం / భీమడోలు / లింగపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జిల్లాలో రహదారులు అధ్వాన స్థితికి చేరాయి. కూటమి ప్రభుత్వం రహదారుల దుస్థితిపై దృష్టి సారించింది. గ్రామాల్లో కొన్ని చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. జిల్లాలో పలుచోట్ల భారీ గోతులు పడిన రహదారులు మరమ్మతు చేస్తున్నారు.

ఏలూరు రూరల్ మండలంలో 14 పంచాయతీల్లో 18 రహదారి పనులకు రూ. 2.8 కోట్లు మంజూరయ్యాయి. డిసెంబరు నెలాఖరుకు రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జోరుగా సాగుతున్నాయి. చాటపర్రు, ప్రత్తికోళ్లలంక, ప్రత్తికోళ్లలంక ఎస్సీ కాలనీ, కోమటిలంక, మాదేపల్లి, చింతమనేని కాలనీ, శ్రీపర్రు, కెడిపురం, మొండికోడులో సీసీ రోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

జంగారెడ్డిగూడెం పట్టణంలో రాళ్లు పైకి లేచి గుంతలతో దర్శనమిస్తున్న సుబ్బంపేట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సాయిబాబా, లలితాదేవి ఆలయాలతో పాటు గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి, బైపాస్ రోడ్డుకు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ రహదారి సమస్యపై దృష్టి సారించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో చర్చించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ తెలిపారు.

భీమడోలు - ద్వారకాతిరుమల ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. ఐదేళ్లుగా గోతులతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయడంతో మరమ్మతు పనులు చేపట్టారు. భీమడోలు సంత మార్కెట్ నుంచి భీమడోలు జంక్షన్ వేంకటేశ్వరస్వామి రూపక దేవాలయం వరకు పనులు జరుగుతున్నాయి. లింగపాలెం మండలంలో ప్రమాదకరంగా మారిన అంతర్గత రహదారులకు మోక్షం కలిగింది. పలు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టారు.

టీచర్ల సెలవులపై పరిమితులు వద్దు : బీటీఏ


సమావేశంలో పాల్గొన్న బీటీఏ నాయకులు

ఏలూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే 50శాతం వరకు టీచర్లు సెలవు వినియోగించుకునే వెసులుబాటును కల్పించాలని టీచర్లు డిమాండ్ చేశారు. శనివారపుపేట ప్రాథమిక పాఠశాలలో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. నాయకులు మాట్లాడుతూ మండలం మొత్తం మీద ఎస్టీటీ ఉపాధ్యాయులు 10శాతం మందికి మించి సెలవులు వినియోగించుకోరాదని పరిమితి విధించడం సరికాదని జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా కొన్ని మండలాల ఎంఈవోలు సెలవులు మంజూరు చేయడం లేదని వివరించారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తికి మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్‌కుమార్, జిల్లా నాయకులు సాల్మన్, సాయిరాజు, గిరిబాబు, ధర్మలింగం, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌లో పశ్చిమ జట్టు జయకేతనం


గెలుపొందిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

ఏలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్‌టోర్నమెంట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ టోర్నమెంట్‌లో పశ్చిమగోదావరి జిల్లాజట్టు ఘన విజయం సాధించింది. జట్టు కెప్టెన్ విజయ్ కుమార్ అర్ధ సెంచరీచేసి జట్టును విజయపథంలో నడిపించారు. రెండు రోజులుగా తిరుపతిలో రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలో పశ్చిమ జట్టు విజయం సాధించింది. జట్టులో మారేష్, వాసు, ప్రసాద్, స్వామి ప్రతిభ కనబరిచారు. విజయం సాధించిన జట్టును పలువురు జర్నలిస్టులు అభినందించారు.

జర్నలిస్టు చందుకు జ్ఞాపిక

ఏలూరు క్రైం: ఏలూరు జిల్లా వార్షిక పోలీస్ క్రీడల దినోత్సవం సందర్భంగా క్రికెట్ ఆటకు రిఫరీగా వ్యవహరించిన సీనియర్ క్రికెట్ ఆటగాడు, జర్నలిస్ట్ చందుకు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్ మెమెంటో అందజేశారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

40 ఏళ్ల తర్వాత.. అపూర్వ కలయిక


సుందరమ్మ ఎయిడెడ్ స్కూలు పూర్వ విద్యార్థులు

ఏలూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి కలిసి చదువుకున్న మిత్రులు నాలుగు దశాబ్దాల ఆదివారం కలుసుకున్నారు. స్కూలు రోజులను గుర్తుచేసుకుని ఆటపాటలతో గడిపారు. తరగతి గదుల్లోకివెళ్లి అప్పటి గురువుల బోధన గుర్తు చేసుకున్నారు. ఏలూరు సుందరమ్మ ఎయిడెడ్ స్కూలులో 1983 బ్యాచ్ విద్యార్థులందరూ అప్పటి జ్ఞాపకాలతో ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థుల్లో పలువురు ప్రస్తుతం ఉపాధ్యాయులుగా, సాంఘిక సంక్షేమశాఖ అధికారులుగా, శాస్త్రవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు.

ఆ పాఠశాలలో.. మూడు దశాబ్దాల నాటి ముచ్చట్లు


జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

జీలుగుమిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో మూడు దశాబ్దాల క్రితం చదువుకున్న మిత్రుల ముచ్చట్లకు మరోసారి వేదిక అయింది. జీలుగుమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల్లో 91-96 వరకు చదివిన విద్యార్థులు ఆదివారం కలిశారు. కార్తీక వన మహోత్సవం ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో కలసి ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. గత మూడేళ్లలో చనిపోయిన ఐదుగురు మిత్రులను గుర్తు చేసుకుని వారికి నివాళులర్పించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా కలసి తమ మిత్రుల్లో. ఎవరికి ఏ ఆపద వచ్చిన అండగా ఉండాలని నిర్ణయించారు. కలసి కట్టుగా సమస్యను పరిష్కరించుకోవాలని, స్నేహబంధం కలకాలం ఇలాగే ఉండాలని ఆకాంక్ష వెలిబుచ్చారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలి


వామపక్షాల సదస్సులో నాయకుల సంఘీభావం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి తదితర వామపక్షాల నేతలు విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల భారంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. వామపక్షాల నాయకులు ఎ.రవి, మన్నవ కృష్ణచైతన్య, యు.వెంకటేశ్వరరావు, తలారి ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల్లో కరెంటు చార్జీలు పెంచబోమని ప్రజలకు ఇచ్చిన మాట కూటమి ప్రభుత్వం తప్పిందన్నారు. దాదాపు 18 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం మోపుతుందన్నారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి, ఏపీఈఆర్‌సి ద్వారా కరెంటు చార్జీలపై వినియోగదారుల అభిప్రాయ సేకరణ చేపట్టిందని తెలిపారు. దీనిపై ప్రజలు, వివిధ సంస్థల్లో కరెంటు చార్జీలను, స్మార్ట్ మీటర్లపై అభ్యంతరాలను విద్యుత్ నియంత్రణ మండలికి పంపడం జరిగిందన్నారు. విద్యుత్ ఉద్యమం చేపట్టకముందే కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే బాదుడు కార్యక్రమాన్ని చంద్రబాబు అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వామపక్షాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, పళ్ళెం కిషోర్, ప్రజల పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వాల నమోదు


బయ్యన్నగూడెంలో సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

కొయ్యలగూడెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వాలు జోరుగా నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 6500 సభ్యత్వాలు నమోదయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తెలిపారు. బయ్యన్నగూడెంలో ఆదివారం టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ టీడీపీ అన్నారు. సభ్యత్వాలు తీసుకుంటున్న మహిళలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, శ్రీను, సీతారామ్, కిట్టూ, తదితరులు ఉన్నారు.

● చింతలపూడి: నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదును నాయకులు, కార్యకర్తలు ముమ్మరం చేయాలని జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. ఉర్లగూడెం, కనిపెడ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాటూరి వెంకట్రామయ్య, బాలా శ్రీనివాసరావు, కె.రాజారెడ్డి, నందిపాం నాగేశ్వరరావు, కె.యువరాజు, ఉలాస సుబ్బారావు, పలువురు పాల్గొన్నారు.

ఎస్సీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి


ఉండవల్లి శ్రీదేవిని కలిసిన మండల నాయకులు

ఉంగుటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆపేసిన ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని పలువురు నాయకులు కోరారు. మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి టీడీపీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం ఆదివారం వినతి పత్రం అందించారు. వివిధ పథకాలు, డప్పు కళాకారులకు అందించే రుణాల సమస్యలు వినతిలో పేర్కొన్నారు. పెదకూరపాడు నాయకుడు చేకూరి వెంకట్, కంచర్ల సుధాకర్ ఉన్నారు.

సుష్మకు బుద్ధబోధి ధర్మ అవార్డు


అవార్డు అందుకున్న సుష్మ

ఏలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరుకు చెందిన టి.సుష్మ బుద్ధ బోధి ధర్మ అవార్డు అందుకున్నారు. న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నరసారావుపేట ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం అవార్డులు అందజేశారు. ప్రముఖులు, సేవామూర్తులకు, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డులు అందజేస్తారు. ఏలూరుకు చెందిన టి.సుష్మ ఫిజికల్ ఎడ్యుకేషన్, జుంబా శిక్షకురాలిగా సేవలు అందిస్తున్నారు. ఆమె అవార్డుకు ఎంపికయ్యారు. ప్రముఖ సినీ నటుడు నరేష్ నుంచి అవార్డు అందుకున్నట్లు సుష్మ తెలిపారు. అవార్డు అందుకున్న ఆమెను పలువురు అభినందించారు.


చిన వెంకన్న ఆలయంలో ఉచిత ప్రసాదంకోసం బారులు తీరిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ


గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆధ్యాత్మిక సందడి

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

ద్వారకాతిరుమల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. కార్తీకమాసం ఆదివారం శ్రీవారి ఆలయం భక్తజనంతో పోటెత్తింది. దాదాపు 18 వేల మంది పైబడి స్వామివారిని దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. సెలవుదినంతో పాటు కార్తీక పర్వదినాలు కావడంతో తెల్లవారుజామునుంచే యాత్రికులు క్షేత్రానికి చేరుకుని క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద రద్దీ

బుట్టాయగూడెం: అటవీ ప్రాంతంలో గుబ్బల మంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనాలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహా నందీశ్వరుడికి పూజలు

పోలవరం: గోదావరి నది మధ్యలో చిత్రకూట పర్వతంపై వెలసిన ఉమా సహిత మహానందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశ రుద్రాభిషేకం, భస్మాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

హనుమాన్ భక్తుల పూజలు

జీలుగుమిల్లి : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ మండల దీక్ష చేపట్టిన భక్తులు ఏకాహం నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రారంభించిన కార్యక్రమం 24 గంటల పాటు ఏకధాటిగా శ్రీరామ జయరామ జయ జయ రామ నామంతో సాగింది.

ముగిసిన గౌరీదేవి ఉత్సవాలు

దెందులూరు: పోతునూరు శివారు కేతవరం గ్రామ దేవత గౌరీ దేవి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. అమ్మవారిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా చింతమనేని ప్రభాకర్, మాగంటి మిల్లుబాబును బోడేటి మోహన్‌బాబు, కాళ్ల అప్పారావు, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు, మోతుకూరి నానిబాబు, నున్న లక్ష్మణ్ బాబు అమ్మవారి దర్శించుకున్నారు.

షష్ఠి ఉత్సవాలకు నిమ్మలకు ఆహ్వానం

ఉంగుటూరు: కైకరం శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు డిసెంబరు 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రి నిమ్మల రామానాయుడిని ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. సర్పంచ్ సలగాల గోపి.పామర్తి సత్తిబాబు, చింతల శ్రీనివాస్ తదితరులు ఆహ్వాన పత్రిక అందించారు.

ఉంగుటూరు భద్రకాళీ అమ్మవారిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.


ఏబీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

సేవా కార్యక్రమాలతో ముందుకు

పెదవేగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా కమ్మవారి సేవాసమితి కృషి చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కమ్మవారి సేవాసమితి ఆధ్వర్యంలో జానంపేటలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ.వెంకటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కమ్మవారి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25మంది రక్తదానం చేశారు. సమితి అధ్యక్షుడు వి.ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, సభ్యులు వి.కృష్ణమోహన్, జి.సత్యనారాయణ, వై.శరత్‌బాబు, కేఎల్.మోహన్, కేవీవీ.ప్రసాద్, బి.వెంకట్రావు, తూంపాటి పద్మవరప్రసాద్ పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు జర్నలిస్టులంతా ఐకమత్యంగా ఉండాలని ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీఎస్ఎన్.రాజు అన్నారు. ఆదివారం చొదిమెళ్లలో జర్నలిస్టుల కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల జర్నలిస్టులు, జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఏలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మినీ బైపాస్‌రోడ్డులోని హేలాపురి బ్రాహ్మణ సేవాసంఘ 42వ వార్షికోత్సవం, కార్తీక వనసమారాధన ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐక్యత చాటుకోవాలన్నారు. సంఘ కార్యదర్శి ఎం.భానుమూర్తి, డీవీ సుబ్బారావు, పి.దుర్గ ప్రభాకరం, కేవీఎస్ శర్మ, రామారావు, సభ్యులు ఎంఎస్ఎస్ శర్మ, గురుప్రసాద్, గురుశర్మ, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం వన సమారాధన

టి.నరసాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మపేట సమీపంలో ఆర్యవైశ్య సంఘ వన సమారాధన నిర్వహించారు. నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మండం సత్యనారాయణ మూర్తి, యువజన సంఘం అధ్యక్షుడు పసుమర్తి రాము, ఎం.సోమరాజు, అద్దంకి రవి, మాదంశెట్టి మల్లయ్య, అద్దంకి రామకృష్ణ, మండం ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆనంద నిలయం అభివృద్ధి

ఉంగుటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆనంద నిలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆనంద నిలయం (వృద్ధాశ్రమం, అనాథాశ్రమం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. మానవత అందించిన అంబులెన్స్‌ను గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. సర్పంచ్ దిడ్ల అలకనంద, గుణ్ణం బుల్లెబ్బాయి, సాగిరాజు జానకి రామరాజు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

నారాయణపురంలో ఆదివారం జరిగిన వెలమ సంఘం కార్తీక వన సమారాధనలో జెడ్పీ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ దంపతులు పాల్గొన్నారు. బళ్ల త్రిమూర్తులు, మరడ మంగారావు, తొత్తల గణపతి, నల్లా ఆనంద్, సప్పా వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొయ్యలగూడెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సంఘాలు కృషి చేయాలని ప్రాంతీయ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి అన్నారు. కొయ్యలగూడెంలో బ్రాహ్మణ వన సమారాధన నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వన సమారాధనలు

జంగారెడ్డిగూడెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం, పట్టణాల్లో కార్తీక వన సమారాధనలు ఘనంగా జరిగాయి. కాపు కార్తీక వన సమారాధనకు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు హాజరు అయ్యారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కాపు నాయకులు కరాటం రాంబాబు, జెట్టి గుర్నాధరావు, పోలినాటి బాబ్జి, రావూరి కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బాపూజీ సీనియర్ సిటిజన్స్ వన సమారాధనలో డీఎస్పీ రవిచంద్ర పాల్గొన్నారు. పలు పోటీలు నిర్వహించారు. కె.కోటేశ్వరరావు, కె.రామచంద్రరావు, కేదారేశ్వరరెడ్డి, ఎస్.రాధాకృష్ణ, కె.త్రినాధరావు, కంచర్ల గాంధీ, బోడా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తాడువాయిలో ఐక్య వేదిక ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఐక్యవేదిక సభ్యులు ఎం.శివరామ్, కె.నారాయణ, ఆర్.నాగదుర్గారావు పాల్గొన్నారు.

పోలసానిపల్లిలో..

భీమడోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. పోలసానపల్లి సమీపంలోని తోటలో జరిగిన కార్తీక వనసమారాధనకు భీమడోలు గ్రామంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులందరూ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో వేడుకగా నిర్వహించారు. ఆర్యవైశ్యులంతా కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. వాసవిమాతను ప్రార్థించి జమ్మి చెట్టుకు పూజలుచేశారు. ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.



వైభవంగా లక్ష దీపోత్సవం

మండవల్లి మండలం లోకుమూడి దత్తా శ్రమంలో కార్తీకమాసం సందర్భంగా లక్ష దీపోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. మంచు శివలింగానికి పూజలు చేసి, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ గురజాడ ఉదయ్ శంకర్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

-మండవల్లి



ఆస్తి కోసం చంపేశాడు

▸▸ పిన్ని, తమ్ముడిని హతమార్చిన కిరాతకుడి అరెస్టు



వివరాలు చెప్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్



హత్యలకు ఉపయోగించిన కత్తి, చాకు

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 40 సెంట్ల వ్యవసాయ భూమి, నాలుగు సెంట్ల ఇంటి స్థలం.. వీటి మార్కెట్ విలువ సుమారు 25 లక్షలు ఉండవచ్చు.. ఈ ఆస్తి కోసం పిన్ని, తమ్ముడిని దారుణంగా హతమార్చాడు ఆ కిరాతకుడు.. జంట హత్యలు జరిగిన 24 గంటల్లోనే పోలీసులు హంతకుడిని అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదివారం విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన రొయ్యూరు సుబ్బారావుకు భార్య నాంచారమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి. సుబ్బారావు నాంచారమ్మ సోదరి అయిన భ్రమ రాంబను రెండో పెళ్ళి చేసుకున్నాడు. భ్రమరాంబకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి కూడా వివాహాలు అయ్యాయి. సుబ్బారావు మతి స్థిమితంలేక ఎటో వెళ్ళిపోయాడు. నాంచా రమ్మ కూడా లేదు. సుబ్బారావు తండ్రి నాగ లింగం పేరుమీద ఉన్న 40 సెంట్ల పొలం, 192 గజాల ఇంటి స్థలం విషయంపై తరచుగా నాంచారమ్మ కుమారుడైన నగేష్‌బాబు (50)కి అతని పిన్ని అయిన భ్రమరాంబ, తమ్ముడైన సురేష్‌కు గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో పెట్టగా ఉన్న ఆస్తిని ఇద్దరు చెరి సగం పంచుకోవాలని సూచించారు. దీనికి నగేష్‌బాబు అంగీకరించ లేదు. కొన్నేళ్ళ క్రితమే నగేష్‌బాబు ఊరువిడిచి విజయవాడ వెళ్ళి ఒక లారీ కొనుగోలు చేసుకుని మోటారు ఫీల్డ్‌లో ఒకస్థాయికి వచ్చాడు. ఆర్థికంగా స్థిరపడ్డాడు. అతని కుమారుడు, కుమార్తెకు కూడా వివాహాలు జరిపాడు. అయితే తాత ఆస్తి తనకే చెందుతుందని, ఒక్క అంగుళం కూడా ఇవ్వనని పెద్దల ముందు చెప్పాడు. ఈ నెల 21న సురేష్ భార్య గాయత్రి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన తండ్రి సంవత్సరీక కార్యక్రమానికి వెళ్ళింది. సురేష్ కూడా ఆ కార్యక్రమానికి వెళ్లి ఈ నెల 22న తిరిగి వచ్చాడు. ముందు హత్య చేయాలని ప్లాన్ చేసుకున్న నగేష్‌బాబు 22వ తేదీ రాత్రి వచ్చి సాయిబాబా గుడి వద్ద ఉన్నాడు. అర్ధరాత్రి వేళ భ్రమరాంబ ఇంటికి వెళ్ళి తలుపులు కొట్టి వారు బయటకు రాగానే హత్య చేయాలని మాటు వేసుకుని అక్కడే ఉన్నాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చిన భ్రమరాంబపై దాడి చేసి కత్తితో మెడపై నరికేశాడు. ఆమె అక్కడే మరణించింది. ఇంట్లోకి వెళ్ళి గాఢ నిద్రలో ఉన్న సురేష్‌ను కూడా చాకుతో పొడిచి హతమార్చాడు. అక్కడ నుంచి వెళ్ళి సాయిబాబా గుడి సమీపంలో కత్తి, చాకును ఒక ప్లాస్టిక్ పైపులో దాచి వెళ్ళిపోయాడు. ఈ నెల 23వ తేదీ ఈ సంఘటన వెలుగులోకి రావడంతో జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్, మండవల్లి ఎస్‌ఐ రామచంద్రరావు, కానిస్టేబుళ్ళు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం దాచిన కత్తులను తీసుకు వెళ్లడా నికి వచ్చిన నగేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో కీల కంగా వ్యవహ రించిన సీఐ రవికుమార్, ఎస్‌ఐ రామచంద్రరావు, కాని స్టేబుళ్ళు నాగాంజనేయులు, నాగార్జునలకు ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను డీఎస్పీ అందించారు.

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య



ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నర్సరావు పేటకు చెందిన వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఆసుపత్రి అత్యవసర విభాగంలో డ్యూటీ చేయడానికి వచ్చారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు గడియ పెట్టుకుని ఎంత సేపటికి రాలేదు. ఉదయం 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సీఈవో డాక్టర్ హనుమంతరావు ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగులగొట్టి చూశారు. డాక్టర్ జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు, సిరంజ్‌లు లభించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జవహర్ తండ్రి డాక్టర్ విజయ్ సాగర్ నర్సరావు పేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవహర్ తన తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదువుతూ మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. ఏలూరు రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తు న్నారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో పోస్టు మార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.





ముసునూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుతున్న స్వాధీనం చేసుకున్న వాహనాలు

వీటి గతి ఇంతేనా?

▸▸ ముసునూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఐదేళ్లుగా పడిఉన్న వాహనాలు



ముసునూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు శిథిలమైపోతున్నాయి. ఐదేళ్ళయినా పోలీస్ ఉన్నతాధికారులు వాహనాల వేలం నిర్వహించకపోవడం శోచనీయం. సుమారు 150 పైగా ఉన్న వాహనాల్లో ఆటోలు, కార్లు సగం పైగా శిథిలమయ్యాయి. బైకులు రోజురోజుకు శిథిలా వస్థకు చేరుతున్నాయి. గత ఐదేళ్ళల్లో ఒక్కసారి కూడా వాహనాల వేలం నిర్వహించకపోవడం తో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గిపోతోంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు వేలం నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.



బాలికలకు అన్ని వసతులు కల్పించాలి

ముసునూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికలకు సకల సదుపాయాలు కల్పించి, ఉత్తమ బోధన అందించాలని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ మస్తానయ్య అన్నారు. శనివారం రాత్రి ముసునూరు గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సౌకర్యాలపై బాలికలను ఆరా తీయగా వారు మరుగుదొడ్లకు తలుపులు సరిగాలేవని, సెప్టిక్ ట్యాంక్ నుంచి దుర్వాసన వస్తోందని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రిన్సిపాల్ కె.ప్రవీణను ఆయన ప్రశ్నించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డులతో పాటు వంటశాల, పాఠశాల ప్రాంగణం, ల్యాబ్ భవన నిర్మాణం, ఆటల కోర్టుల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం జరిగేలా చూడాలని ప్రిన్సిపాల్ కోరగా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సెక్రటరీ తెలిపారు. ఎంఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చిట్టెం

చాట్రాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెం మామిడితోటలో ఆదివారం చనుబండ ఏరియా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ కార్తీక వన సమారాధన నిర్వహించారు. అనంతరం తీర్థాల అద్భుతరావు పర్యవేక్షణలో యూనియన్ ఎన్నిక నిర్వహించగా అధ్యక్షుడిగా చిట్టెం వేణుగోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మిద్దె అంజి, కార్యదర్శిగా గంజిబోయన శ్రీరామ్, సంయుక్త కార్యదర్శిగా బాడ్సి నరసింహారావు, కోశాధికారిగా పల్లెపోగు వినయ్, సభ్యులుగా మరో 4 గురు ఎన్నికైనట్లు ప్రకటించారు.



పేదలకు మానవత చేయూత

మండవల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తుందని కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ తెలిపారు. మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సంస్థ మండల అధ్యక్షుడు గుడివాడ విజయ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మండవల్లి మండలం అల్లినగరం గ్రామానికి చెందిన మెరుగు మరియమ్మ, మండవల్లి గ్రామానికి చెందిన దేవాది శ్రీనివాసరావుకు నిత్యావసర సరుకులు సంస్థ ద్వారా అందించారు. మానవత కార్యవర్గ సభ్యుడు ఎలికె రాంబాబు తదితరులు పాల్గొన్నారు..



ముసునూరులో సెంటర్లో ర్యాలీ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు

యువత దేశభక్తి కలిగి ఉండాలి

ముసునూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత దేశభక్తి, నైతిక విలువలు కలిగి ఉన్నప్పుడే అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించవచ్చని ఆర్‌సీఎం చర్చి రెవ.ఫా.జోసఫ్ తంబి అన్నారు. ఆదివారం ముసునూరు ఆర్‌సీఎం చర్చిలో ముక్కొల్లుపాడు, నెహ్రూనగర్, రమణక్కపేట, వలసపల్లి, ముసునూరు, చింతలవల్లి, సింహాద్రిపురం సంఘాల్లోని యువకులతో దేశభక్తి, నైతిక విలువలపై యూత్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ డి.అబ్రహాం యువత నైపుణ్యాలు, నైతిక విలువలు, సామాజిక స్పృహ తదితర వాటిపై యువతీయువకులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామ యువత, ఫాదర్లు ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సహాయ గురువులు ఇలవరసన్, ఉపదేశకులు దేవరపల్లి బెనర్జీ, అర్చణాలయ ఫాదర్లు నోవిస్, జోయ్ అమల్, నిర్మలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాల నమోదు

కలిదిండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాల నమోదు ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం మట్టగుంట, బొడ్డు వానిగట్టు తదితర గ్రామాల్లో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం నమోదు చేయించుకున్న వారందరికీ రూ. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బళ్లా రాజు, నాయకులు పాల్గొన్నారు.

పక్కా డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

ముదినేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వడాలిలో రూ.3.75 లక్షల నిధులతో పద్మశాలీల రోడ్డులో నిర్మించనున్న పక్కా డ్రైన్ పనులకు ఆదివారం టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని అంతర్గత రహదారుల అభివృద్ధితోపాటు పక్కా డ్రైన్ల నిర్మాణాలను కూడా చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. సర్పంచ్ దుర్గా శ్రీ, టీడీపీ నాయకులు గురువు సుబ్రహ్మణ్యం, కట్టా రామయ్య, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



పెదలంకలో రంగు మారిన తాగునీటి చెరువు

పెదలంకలో దాహం.. దాహం..

కలిదిండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదలంక తాగునీటి చెరువులో నీరు రంగు మారటంతో ఉప్పుశాతం పెరిగింది. దీంతో కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగు నీరు ఉప్పగా ఉంటుందని గ్రామస్థులు వాపోతున్నారు. తాగునీటి కోసం పలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో చుట్టూ చేపలు, రొయ్యల చెరువులు ఉన్నప్పటికీ తాగటానికి గుక్కెడు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి చెరువు నీటి మట్టం తగ్గటంతో రంగు మారి ఉప్పు శాతం పెరిగిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. సీబీ కెనాల్‌కు సుమారు 400 క్యూసెక్కుల తాగునీరు విడుదల చేస్తేనే పెదలంక తాగునీటి చెరువు నింపటానికి వీలు పడుతుందని అధికారులు అంటున్నారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లలో తాగునీరు కొనుగోలు చేసి తాగు తున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. పేదలు, వృద్ధులు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాల్వకు తాగునీరు విడుదల చేసి పెదలంక చెరువును పూర్తిగా నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణను వివరణ కోరగా, తాగునీటి చెరువును నింపేందుకు వంతు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు విన్నవించామని వంతు ఇవ్వగానే యుద్ధ ప్రాతిపదికన నింపుతామన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్

ముసునూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులపై ఆదివారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ రాజ్ కుమార్ వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులు, వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించి, బీఎల్వోలకు పలు సూచనలు ఇచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటరు గుర్తింపు కార్డుల్లో ఏమైన తప్పులు ఉన్నా, మార్పులు చేసుకోవాలన్నా బీఎల్వోలకు అర్జీలు అందజేయాలని తహసీల్దార్ కోరారు. డిప్యూటీ తహసీల్దార్ కె.వి.రమణ, ఆర్‌ఐ దీపిక తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలంతో జాగ్రత్త

నూజివీడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్తమా బాధితులు శీతాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జై కిషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ జై కిషన్ అన్నారు. యనమదలలో జేకే ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 110 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. శీతాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన నిర్వహించారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

ముసునూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ (విజయ డెయిరీ), రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ముసునూరు పశువైద్యశాలలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.కృష్ణ చైతన్య ఆదివారం తెలిపారు. పశువులను పరీక్షించి, మందులను అందజేస్తారని, ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైమ్ కార్నర్

కోడి పందేల స్థావరాలపై దాడి

ఆగిరిపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానపల్లి గ్రామంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకుని రూ. 7,100 నగదు, 10 వాహనాలు, రెండు పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ తెలిపారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా 112కు డయల్ చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

650 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లపు ఊటను నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ఆదివారం ధ్వంసం చేశారు. చాట్రాయి మండలం పోతనపల్లిలో నిర్వహించిన దాడుల్లో 650 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఎస్సైలు బి.రాజేంద్ర ప్రసాద్, ఎం.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు వన సమారాధనలో వేదవ్యాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం



పేద విద్యార్థులకు చెక్కులను అందజేసిన పీవీఆర్ ట్రస్ట్



చాట్రాయిలో ఫొటోగ్రాఫర్స్ యూనియన్ వన సమారాధన



వడాలిలో కార్తీక సమారాధనలో పాల్గొన్న గ్రామస్థులు



నూజివీడు వనమహోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

వన భోజనాల సందడి

▸▸ అన్నివర్గాలు అభివృద్ధి చెందాలన్న మంత్రి పార్థసారథి

నూజివీడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సామాజిక వర్గాలు అన్నీ కలిసి కట్టుగా ఉండి అభివృద్ధి చెందాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో యాదవ, భావనరుషి పద్మశాలీ వనసమారాధన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సారథికి గజమాలతో నిర్వాహకులు ఘన స్వాగతం పలుకగా అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్నివర్గాల వారు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఒకరిని ఒకరు సహాయం చేసుకుంటూ సోదరభావంతో అభివృద్ధివైపు అడుగులు వేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం బీసీ, ఇతర సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లిలో అట్లూరి వంశీయుల వన సమారాధన జరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని అట్లూరి వంశీయులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో..

చాట్రాయి: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్తీక వన సమారాధన ఆదివారం చాట్రాయిలోని మామిడితోటలో జరిగింది. పలు గ్రామాల నుంచి ఫొటోగ్రాఫర్లు కుటుంబాలతో వచ్చి ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

వెలమ సంక్షేమ సంఘం..

కలిదిండి: వెలమలంతా విద్యావంతులు కావాలని పీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ రమేష్ బాబు అన్నారు. ఆదివారం పెదలంక నాగేశ్వరస్వామి ఆలయం వద్ద కైకలూరు నియోజకవర్గ వెలమ సంక్షేమ సంఘం వనసమారాధన నిర్వహించారు. 10 మంది పేద విద్యార్థులకు లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అక్కల వెంకటాచలం, నాయకులు పాల్గొన్నారు.

కాపు సంఘం..

కైకలూరు: కాపు సంఘాలు సంఘటితంగా ఉండి అభివృద్ధి చెందాలని మాజీ ఉపసభాపతి వేదవ్యాస్ అన్నారు. ఆదివారం కైకలూరు మార్కెట్ యార్డులో నియోజకవర్గ కాపు సంఘం కార్తీక వనసమారాధన కమిటీ సభ్యుల ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సుధాకర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున ప్రోత్సాహక బహుమతులను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రజక సంఘం..

రజకుల కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని ఉమ్మడి కృష్ణా జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్టయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, బీసీ నాయకుడు లావేటి వీరశివాజీ, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

ముదినేపల్లి: వడాలిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, సర్పంచ్ దుర్గా శ్రీ, నాయకులు పాల్గొన్నారు.